aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people.
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
శనివారం
15-08-2026 సంపుటి : 01 సంచిక :144 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలి

- కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే చెప్పా
- రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటా
- కాంగ్రెస్‌ను విమర్శించలేదు
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి క్లారిటీ

హైదరాబాద్ ఆగస్టు 14 (మహాప్రభ):
కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్న చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణచివేస్తున్నారనే విషయాన్ని తాను -మిగతా 3 లో



## ఎర్రకోట ముస్తాబు

- వందేమాతరంతో కొత్త శకం
- పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం
- ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు
- బస్తర్‌లోని 92 గ్రామాల్లో వేడుకలు
- ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం.. హైఅలర్ట్

03

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశం సర్వం సిద్ధమైంది. ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. 150 ఏళ్ల 'వందేమాతరం'కు ప్రత్యేక గౌరవం, యువశక్తికి పెద్దపీట, మారుమూల గ్రామాల్లో తొలిసారి త్రివర్ణ పతాక ఆవిష్కరణ వంటి విశేషాలతో ఈసారి వేడుకలు మరింత ప్రత్యేకత సంతరించుకున్నాయి.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

### డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో..

- ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో ఉపసంఘం..
- హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువు పొడిగింపు
- ప్రభుత్వ, వివాదాల్లేని భూ సమస్యలు పరిష్కరిస్తాం..
- క్యూర్ పరిధిలో ఎలక్ట్రిక్ వాహనాలుగా ఆటోలు
- 7 రకాల సన్నాలకే బోనస్..
- స్కిల్స్ వర్సిటీ పరిధిలోకి ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్‌లు..
- 7 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలు మంజూరు..
- నేడు సంగారెడ్డిలో ఘనంగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ
- మంత్రివర్గం నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 14 (మహాప్రభ):
గతేడాది తరహాలోనే ఈ ఏడాది కూడా డిసెంబర్ ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఫ్యూచర్‌సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ సమ్మిట్ నిర్వహణ కోసం ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి సభ్యులుగా ఉన్నారు. గతేడాది తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించినట్టే ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సదస్సు నిర్వహణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానంగా రాష్ట్రంలో రక్షణ, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ సదస్సు -మిగతా 3 లో





## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోటకు బాంబు బెదిరింపు

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ భద్రతా వ్యవస్థ అప్రమత్తం
- ఆగస్టు 15న పేలుళ్లకు పాల్పడతామంటూ ఈమెయిల్‌లో హెచ్చరికలు
- ఖలిస్తాన్ పేరుతో బెదిరింపులు.. హైకోర్టును టార్గెట్ చేసినట్లు ప్రకటన
- కీలక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు, ఎంట్రీ-ఎగ్జిట్ మార్గాలపై నిఘా
- ఎయిర్‌పోర్టులు, కోర్టులు, ప్రజా ప్రదేశాల్లో భద్రత మరింత కట్టుదిట్టం

న్యూఢిల్లీ ఆగస్టు 14 (మహాప్రభ):
దేశం ఒకపక్క స్వాతంత్ర్య దిన వేడుకలకు సిద్ధమవుతుంటే.. మరోపక్క దేశ రాజధానికి మాత్రం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు, ఎర్రకోట, హైకోర్ట్ సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం అధికారులకు ఒక ఈమెయిల్ వచ్చింది. దీనిలో ఢిల్లీలోని కోర్టులు, రైళ్లలో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించారు. ఆగస్టు 15న ఈ పేలుళ్లు జరుపుతామని -మిగతా 3 లో

## నీటిని ఆపితే యుద్ధమే


- భారత్‌కు పాక్ ప్రధాని హెచ్చరిక
- ప్రతి బొట్టూ భారత్‌కు రెడ్ లైన్
- సింధూ జలాలపై పాక్ ప్రధాని ప్రగల్భాలు
- మా రక్షణకు ముప్పు వాటిల్లితే ఊరుకోం
- షెహబాజ్ షరీఫ్ కవ్వింపు వ్యాఖ్యలు



03

### ఆగష్టు చివరి వరకు విస్తారంగా
## వర్షాలు కురిసే అవకాశం

03



- బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాల ప్రభావం
- దేశ తూర్పు, పశ్చిమ, మధ్య ప్రాంతాల్లో వానల జోరు
- వచ్చే 15 రోజుల్లో గణనీయమైన వర్షపాతంపై అంచనాలు
- ఎల్‌నినో ప్రభావంతో కొనసాగుతున్న వర్షాభావ పరిస్థితులు
- వర్షపు లోటు తగ్గించే దిశగా అనుకూల వాతావరణం

### వికసిత్ భారత్ కోసం
## అందరూ పనిచేయాలి



- జాతినుద్దేశించి మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన జ్యోతిబా పూలే, సావిత్రిబాయి
- మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని ప్రశంసలు గుప్పించిన ముర్ము

03



## సొమ్మొకడిది సోకొకడిది అన్నట్లు ఉంది

- రేషన్ కార్డులపై ఫోటోలు లేకుండా పంపిణీ చేయాలి
- లేదంటే ప్రధానమంత్రి ఫోటో కూడా పెట్టాలి
- రేషన్ బియ్యానికి ఎక్కువ డబ్బులు ఇస్తుంది కేంద్రమే
- ప్రజాసమస్యలు చర్చించకుండానే పార్లమెంట్ సమావేశాలు ముగిసాయి
- చర్చనడ్డుకొని ప్రతిపక్షాలు గొప్ప అవకాశాన్ని కోల్పోయాయి : ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ ఆగస్టు 14 (మహాప్రభ):
బీజేపీ తెలంగాణ ఎంపీలుగా మేము కేంద్రమంత్రులను కలిసి అనేక సమస్యల మీద వినతులు అందించాం అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని జవాహర్ నగర్ డంప్ యార్డు, హైదరాబాద్ మెట్రో, నేషనల్ హైవేలు, ట్రిపుల్ ఆర్ ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరామన్నారు. రైల్వే మంత్రిని కలిసి రైలుపట్టాల మీద ప్రమాదాలు జరగకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఆర్ఓబి, ఆర్ యు బి సంఖ్య -మిగతా 3 లో



## వీ లవ్ ఇండియా

- శ్రీలంక నుంచి జపాన్ వరకు..
- 36 దేశాల్లో 45 శాతం సానుకూలత
- సర్వేలో 79 శాతంతో టాప్‌లో శ్రీలంక
- 7 శాతంతో చివరిస్థానంలో పాకిస్థాన్
- ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వేలో వెల్లడి


న్యూఢిల్లీ:
శ్రీలంక నుంచి జపాన్ వరకు ఏ దేశాలు భారత్ ను ఎక్కువగా ప్రేమిస్తున్నాయి? అనే శీర్షికతో ప్యూ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన వసంతకాలం 2026 గ్లోబల్ యాటిట్యూడ్స్ సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా భారత్ పట్ల అభిప్రాయాలు మిశ్రమంగా ఉన్నాయి. 36 దేశాల్లో సర్వే నిర్వహించగా సగటున 45 శాతం మంది అనుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. 41 శాతం మంది ప్రతికూలంగా చూస్తున్నారు. శ్రీలంకలో అత్యధిక అనుకూలత నమోదైంది. అక్కడ 79 శాతం మంది భారత్ పట్ల సానుకూల అభిప్రాయం కలిగి ఉన్నారు. ఇది సర్వేలో అత్యున్నత స్థానం. యునైటెడ్ కింగ్ డమ్, కెన్యాలో 71 శాతం మంది అనుకూలంగా చూస్తున్నారు. జర్మనీలో 63 శాతం, ఇజ్రాయెల్ లో 60 శాతం, ఇటలీలో 56 శాతం, స్వీడన్, జపాన్, థాయ్ లాండ్ లో 55 శాతం అనుకూల అభిప్రాయం వ్యక్తమైంది. కెనడా, సింగపూర్ లలో 51 శాతం, ఫ్రాన్స్, ఇండోనేషియాలో 50 శాతం అనుకూలంగా ఉన్నారు. అమెరికాలో 45 శాతం అనుకూలంగా చూస్తున్నారు. బంగ్లాదేశ్ లో 42 శాతం మాత్రమే అనుకూలం. పాకిస్థాన్ లో అత్యల్పం నమోదైంది. అక్కడ కేవలం 7 శాతం మంది మాత్రమే అనుకూల అభిప్రాయం కలిగి ఉన్నారు. 91 శాతం మంది ప్రతికూలంగా చూస్తున్నారు.

### పూలే ఆశయాలు
# కొనసాగిస్తాం

### బీసీ జనగణన చేయడానికి దేశంలో ఎవరూ ధైర్యం చేయలేదు

- బ్రిటీష్ వాళ్ల తర్వాత ఎవరూ బీసీ జనగణన చేయలేదు
- కాని మేము బీసీ జనగణన చేసి బీసీల లెక్క తేల్చాం
- యేడాదిలో బీసీ జనగణనను పూర్తి చేశాం
- పారదర్శకంగా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తాం
- నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని అందించే బాధ్యత నాది : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 14 (మహాప్రభ):
150 ఏళ్ల క్రితం మహాత్మ జ్యోతిబాపూలే అనగారిన వర్గాల కోసం కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతి బా పూలే డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను దేశంలో ఎక్కడకిపోయినా చూస్తుంటాం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నగరంలో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు అంబేద్కర్, మరో వైపు ఇందిరా -మిగతా 3 లో



## ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడమే లక్ష్యంతో పునఃసర్వే.

-లైసెన్స్‌డ్ సర్వేయర్లను భూ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యం.

-పునఃసర్వే పని కోసం 20 మంది అర్హులైన అభ్యర్థులకు లైసెన్సులు జారీ.

-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -14ఆగస్ట్ (మహాప్రభ )**
ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడమే లక్ష్యంతో పునఃసర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ లైసెన్స్ సర్వేయర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ చాంబర్లో జిల్లాలో పునఃసర్వే పనులు చేపట్టేందుకు నిర్దేశిత అర్హత/శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 20 మంది అర్హులైన అభ్యర్థులకు సర్వే మరియు భూ రికార్డుల శాఖకు చెందిన సంబంధిత అధికారుల సమక్షంలో ఎంపికైన అభ్యర్థులకు లైసెన్సులను లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి రికార్డులను నవీకరించడం మరియుమెరుగుపరచడం, ఖచ్చితమైన సర్వే సరిహద్దులను స్థాపించడం, మరియు భూ యజమానులకు, ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడం అనే లక్ష్యంతో పునఃసర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని,.లైసెన్స్ పొందిన సర్వే అభ్యర్థులు, సర్వే మరియు భూ రికార్డుల శాఖ నిర్దేశించిన సాంకేతిక విధానాలు, నియమాలు మరియు సూచనల ప్రకారం పునఃసర్వే కార్యకలాపాలను నిర్వహించడంలో సహాయపడతారని. సర్వేయర్లు తమ విధులను నిష్పక్షపాతంగా, కచ్చితంగా మరియు పారదర్శకంగా నిర్వర్తించాలని, అలాగే రెవెన్యూ మరియు సర్వే శాఖ అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, సంబంధిత ల్యాండ్ సర్వీస్ సిబ్బంది లైసెన్స్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు

## స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట భద్రత.

మెదక్‌లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు.




**మెదక్ జిల్లా -14ఆగస్ట్ (మహాప్రభ )**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం మెదక్ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మెదక్ బస్టాండ్, రైల్వే స్టేషన్, సినిమా థియేటర్లు, కలెక్టరేట్, కోర్టు ప్రాంగణంతో పాటు ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది ప్రత్యేక పరికరాలతో అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, పరిసరాలను తనిఖీ చేశారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్ సహాయంతో అనుమానాస్పద ప్రదేశాలను పరిశీలించారు.
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సై విట్టల్, హెడ్ కానిస్టేబుళ్లు ఫస్సియొద్దీన్, రవీందర్, కానిస్టేబుళ్లు నర్సింలు, దుర్గ ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి దేవాలయము దర్శించుకున్న బి.ఆర్.ఎస్.

-దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్



**దేవరకొండ ఆగస్టు 14( మహా ప్రభ )**
శుక్రవారం పి ఏ పల్లి మండలం లోని రాంపురం గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయము దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన బిఆర్ ఎస్. దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి గుడి గోపురానికి తమ వంతు సహాయంగా 1,00,116 టఒక లక్ష నూట పదహారు రూపాయలఊరూపాయల విరాళం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో రాంపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ నేనావత్ అనిత - లక్ష్మణ్ నాయక్, పార్టీ నాయకులు ఘనపురం శంకర్ మాజీ సర్పంచ్ శివాజీ, గ్రామ శాఖ అధ్యక్షులు చందు నాయక్ ,నరేష్ ,రవి కుమార్ ,ఇస్లావత్ కుమార్, వార్డు సభ్యులు కృష్ణ , మాజీ సర్పంచ్ అభ్యర్థి బాలాజీ, హనుమ నాయక్ ,బాల్య నాయక్, గిరి నాయక్ ,రామ రావు ,రామచంద్ ,వార్డు సభ్యులు ప్రసాద్, బీమా నాయక్ ,చాంద్య నాయక్ ,వార్డు సభ్యులు సైదా నాయక్, ఉప సర్పంచ్ భీముడు, రవి ,జవహర్ లాల్ ,పుట్టాం గండి జబ్బార్ లాల్ నాయక్,రామ కృష్ణ,వెంకటేష్,తదితరులు పాల్గొనారు

# దాతల సహకారంతోప్రెస్ క్లబ్ పనులు.

మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరసింహ చారి.ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్.



**మెదక్ జిల్లా -14ఆగస్ట్ (మహాప్రభ ).**
మెదక్ జర్నలిస్టుల వేదికకు కొత్త కళ సంతరించుకుంది. నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించి కేవలం పది రోజులు గడవకముందే ప్రెస్ క్లబ్‌లో కనిపిస్తున్న మార్పులు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. జర్నలిస్టుల ఆత్మగౌరవానికి, వృత్తిపరమైన అవసరాలకు అనుగుణంగా ప్రెస్ క్లబ్‌ను తీర్చిదిద్దేందుకు కార్యవర్గం చేపడుతున్న చర్యలు ఆకట్టుకుంటున్నాయి.
ఎన్నాళ్లుగానో అవసరంగా ఉన్న మౌలిక వసతులను ఒక్కొక్కటిగా సమకూర్చుతూ ప్రెస్ క్లబ్‌ను మరింత సౌకర్యవంతమైన, గౌరవప్రదమైన వేదికగా తీర్చిదిద్దుతున్నారు. అధ్యక్షుడు శివ్వన్నగారి నరసింహ చారి ప్రత్యేక చొరవతో ప్రారంభమైన ఈ మార్పులకు ప్రధాన కార్యదర్శి బచ్చు సంగమేశ్వర్, కోశాధికారి చెవిటి అశోక్, గౌరవ అధ్యక్షుడు కామాటి కృష్ణ, కార్యవర్గ సభ్యుల సమన్వయం, దాతల సహకారం తోడవడంతో ప్రెస్ క్లబ్‌కు కొత్త హంగులు అందిపుచ్చుకున్నాయి.
జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ అధికార యంత్రాంగానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తుంటారు. అలాంటి జర్నలిస్టులు సమావేశమయ్యే ప్రెస్ క్లబ్‌లో సరైన వసతులు ఉండటం అవసరం. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త కార్యవర్గం వేగంగా చర్యలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రెస్ క్లబ్‌లో ప్రెస్‌మీట్లు, సమావేశాలు నిర్వహించేందుకు అనువుగా హాల్‌ను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. ఒకేసారి సుమారు 100 మంది కి కుర్చీలు, గాలి ప్రసరణకు కొరకు 10 ఫ్యాన్లు, అవసరమైన టేబుళ్లను దాతల సహకారంతో సమకూర్చారు. దీంతో గతంలో ఉన్న మౌలిక వసతుల కొరతను అధిగమిస్తూ ప్రెస్‌మీట్లు, సమావేశాలను సౌకర్యవంతంగా నిర్వహించుకునే పరిస్థితి ఏర్పడింది.
ప్రెస్ క్లబ్ భవనానికి ఉన్న షట్టర్లను శుభ్రం చేయించడంతో పాటు పరిసరాలను కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భవనం భయట రూపురేఖలు మారేలా చర్యలు చేపట్టడం, లోపల అవసరమైన వసతులను సమకూర్చడం ద్వారా ప్రెస్ క్లబ్‌ను మరింత ఆహ్లాదకరమైన వాతావరణంగా మార్చే ప్రయత్నం చేశారు. ప్రెస్ క్లబ్‌కు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, వివిధ రంగాల ప్రముఖులకు గౌరవప్రదమైన వాతావరణం కల్పించేలా ఏర్పాట్లు చేశారు.
80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భవనం ముందు జాతీయ జెండా ఆవిష్కరణకు ప్రత్యేకంగా గద్దె ఏర్పాటు చేయడంతో పాటు, పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. స్వాతంత్ర్య వేడుకలు పండుగ వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. జర్నలిస్టుల వేదికపై జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటడంతో పాటు ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న సందేశాన్ని అందించేందుకు ప్రెస్ క్లబ్ సిద్ధమయింది.
మెదక్ ప్రెస్ క్లబ్‌లో చోటుచేసుకుంటున్న మార్పులు ఒక్కరి కృషి ఫలితం కాకుండా సమష్టి కృషికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. అధ్యక్షుడు శివ్వన్నగారి నరసింహ చారి ముందుండి కార్యక్రమాలను నడిపిస్తుండగా, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్,కోశాధికారి చెవిటి అశోక్, గౌరవ అధ్యక్షుడు కామాటి కృష్ణ, కార్యవర్గ సభ్యులు సమన్వయంతో సహకరిస్తున్నారు. దాతలు కూడా తమ వంతు సహకారం అందించడంతో అవసరమైన సదుపాయాలు త్వరితగతిన సమకూరుతున్నాయి. కొత్త కార్యవర్గం బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, అందుకు అనుగుణంగా పనులు చేపట్టడం ఇప్పుడు జర్నలిస్టు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా కార్యవర్గాలు ఏర్పడిన తర్వాత ప్రణాళికలు రూపొందించడానికి కొంత సమయం పడుతుంది. కానీ ఇక్కడ పది రోజుల్లోనే స్పష్టంగా కనిపించే మార్పులు తీసుకురావడం కార్యవర్గం పనితీరుకు నిదర్శనంగా పలువురు అభివర్ణిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇదే ఉత్సాహంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే మెదక్ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు మరింత గౌరవప్రదమైన, సౌకర్యవంతమైన వేదికగా నిలిచే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
ప్రస్తుత మార్పులు ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తొలి అడుగులుగా భావిస్తున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శివ్వన్నగారి నరసింహ చారి పేర్కొన్నారు. భవిష్యత్‌లో జర్నలిస్టుల వృత్తిపరమైన అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రెస్ క్లబ్‌ను మరింత సమర్థవంతమైన సమాచార వేదికగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. కార్యవర్గ సభ్యుల సమన్వయం, దాతల సహకారంతో ప్రెస్ క్లబ్‌కు కొత్త రూపాన్ని తీసుకొస్తున్నట్లు చెప్పారు.

# 2027 జనాభా లెక్కల్లో 40 ప్రశ్నలు..


కులం, ఎస్సీ, ఎస్టీ హోదా, ఆధార్, బ్యాంక్ డిటేల్స్ సేకరణ




**న్యూఢిల్లీఆగస్టు 14 (మహాప్రభ):**
జనాభా లెక్కల సేకరణకు చెందిన ప్రశ్నావళిని కేంద్ర హోంశాఖ రిలీజ్ చేసింది. 2027 జనాభా లెక్కల(జనఅంబం 2027) సేకరణలో భాగంగా 40 ప్రశ్నలు అడగనున్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ నోటీఫికేషన్ జారీ చేశారు. 1948 జనాభా లెక్కల చట్టం కింద ఆ నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. ఇంటింటి సర్వేలో సమాచార సేకరణ కోసం మొత్తం 40 ప్రశ్నలు వేస్తారు. భౌగోళిక, సామాజిక, విద్యా, ఆర్థిక అంశాల వివరాలను ప్రశ్నావళిలో అడగనున్నారు. వ్యక్తి పేరు, ఇంటి యాజమానితో రిలేషన్, లింగం, పుట్టిన తేది, వయసు, మ్యారేజ్ స్టేట్, జీవిత భాగస్వామి పేరు, నేషనాలిటీ లాంటి సమాచారాన్ని సేకరించనున్నారు. ఇక మతపరమైన అంశాల్లో షెడ్యూల్ కులమా లేక షెడ్యూల్ తెగకు చెందిన వారా అని తెలుసుకోనున్నారు. కులం, తల్లితండ్రులు, వైకల్యం, మాతృభాషతో పాటు ఇతర అంశాలను సేకరిస్తారు. అక్షరాస్యత, డిజిటల్ లిటిరసీ స్టేటస్ కూడా తెలుసుకుంటారు. కోవిడ్19 టీకా తీసుకున్నారా, ఎన్ని బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి, డాక్యుమెంట్ల వివరాలు, మొబైల్ నెంబర్, ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు వివరాలు కూడా సేకరించనున్నారు. లడాక్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో సెప్టెంబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు జనాభా లెక్కల సమాచారాన్ని సేకరించనున్నారు. దేశంలోని మిగితా ప్రాంతాల్లో వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణ జరగనున్నది. జనాభా లెక్కల్లో భాగంగా తొలిసారి కులం వివరాలను సేకరించనున్నారు.

## పౌరులు శాంతియుత విప్లవానికి దిగాలి

దేశంలో భారీ మార్పులు అవసరం : వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (మహాప్రభ):**
దేశ ప్రజలు తమ రాజకీయ నేతను ఎన్నుకునే విధానంలో శాంతియుత విప్లవానికి దిగాలని, 2047 నాటికి భారత్ ఒక గౌరవప్రదమైన దేశంగా నిలవాలంటే భారీ మార్పులు అవసరమని ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయనొక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సహాయపడగల నిస్వార్థపరులు, నిర్భయులు, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన స్త్రీ, పురుషుల పేర్లను సూచించాలని అన్నారు. మన దేశ ప్రగతిని పొరుగు దేశాలతో పోల్చి, దేశ ఆర్థిక స్థితిపై ఆందోళన చెందినట్టు వాంగ్‌చుక్ పేర్కొన్నారు. 50 ఏండ్ల క్రితం ఎంతో వెనుకబడిన లేదా సమానంగా ఉన్న పొరుగుదేశాలు ఇప్పుడు భారత్‌ను దాటి ఎన్నో మైళ్లు ముందుకు వెళ్లిపోయాయని శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియాలను ఉద్దేశించి పేర్కొన్నారు.

## కరెంట్‌షాక్‌పై పరిహారం కోరవచ్చు..

-గాయపడ్డా, మరణించినా విద్యుత్తు సంస్థలదే బాధ్యత

సుప్రీంకోర్టు కీలక తీర్పు




**న్యూఢిల్లీ ఆగస్టు 14 (మహాప్రభ):**
కరెంట్ షాక్‌తో గాయపడ్డా లేదా మరణించినా పరిహారం కోరవచ్చని సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు ఇచ్చింది. కరెంట్ షాక్‌లకు విద్యుత్తు సరఫరా సంస్థలు, ప్రసార సంస్థలే బాధ్యత వహించాలని తెలిపింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ నోంగ్‌మీకపామ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కర్ణాటక హైకోర్టు రెండు కేసుల్లో ఇచ్చిన తీర్పులను సవాల్ చేస్తూ రాష్ట్ర పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. అందులో మొదటి కేసు.. 2018లో కర్ణాటకకు చెందిన ఎన్ సుబ్రమణ్య అనే వ్యక్తి తన పొలంలో పనులు చేస్తుండగా అల్యూమినియం నిచ్చెన 11కేవీ వైర్లకు తాకి అతను చనిపోయాడు. అతని భార్య రూ.25,52,500 పరిహారం కోరుతూ పిటిషన్ వేయగా డివిజన్ బెంచ్ సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది.

**వాహన చట్టం ప్రకారం..**
మరో కేసులో ముయిజ్ అహ్మద్ షరీఫ్ పక్కింటి మీద క్రికెట్ బాల్ తీయడానికి వెళ్లినప్పుడు 66కేవీ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి రూ.44,32,050 పరిహారం ఇవ్వాలని హైకోర్టు బెంచ్ తీర్పునిచ్చింది. ఈ రెండు కేసుల్లో జరిగిన ఘటనలు వివాదాల్లో ఉన్నాయని.. తాము డబ్బులు ఇవ్వలేమంటూ కేపీటీసీఎల్ సుప్రీంలో పిటిషన్లు వేసింది. అత్యున్నత ధర్మాసనం విచారణ సందర్భంగా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో హైకోర్టులకు రిట్ పిటిషన్ల అధికారాన్ని వినియోగించుకోవచ్చని తెలిపింది. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పులను సమర్థించింది.

# జైపూర్ రోడ్డుపై వ్యోమగాములు

-గుంతల్లో నిలబడి రాకెట్, పడవలతో స్థానికుల నిరసన

-చంద్రుడిపై గుంతలనే మించిపోయాయంటూ ఆగ్రహం



**జైపూర్ ఆగస్టు 14 (మహాప్రభ):**
బీజేపీ పాలిత రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని జోత్వారా ప్రాంతంలో రోడ్ల దుస్థితి, మురుగునీరు, డ్రైనేజీ సమస్యలపై స్థానికులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కొందరు వ్యోమగాముల వేషధారణలో కనిపించగా, మరోవైపు ఒక రాకెట్‌ను కూడాప్రదర్శనలో భాగంగా తీసుకొచ్చారు. జోత్వారాలో అధ్వానంగా మారిన రోడ్లు, దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థతో విసిగిపోయిన స్థానికులు ఈ వినూత్న నిరసనకు దిగారు. రోడ్లపై ఇప్పుడు చంద్రుడు లేదా అంగారకుడి ఉపరితలం కంటే ఎక్కువ గుంతలు ఉన్నాయని వారు ఎద్దేవా చేశారు. నిరసనకు ఉపయోగించిన రాకెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని నిరసనకారులకు చలాన్ విధించారు.

# ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలి

మొదటి తరువాయి


గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడవవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోటకు బాంబు బెదిరింపు

మొదటి తరువాయి

మెయిల్‌లో ఉంది. అందులోనూ ఢిల్లీ హైకోర్టును ఆగష్టు 15న మధ్యాహ్నం 2.11 గంటలకు పేల్చేస్తామని కూడా పేర్కొన్నారు.ఢిల్లీని ఖలిస్తాన్‌లో భాగంగా చేయాలనే లక్ష్యంతో ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో పేర్కొన్నారు. సిక్కులకు న్యాయం చేయడంలో ఢిల్లీ హైకోర్టు విఫలమైనట్లు, అందులోనూ 1984లో జరిగిన సిక్కు అల్లర్ల కేసులో బాధిత సిక్కులకు కోర్టు న్యాయం చేయలేకపోయిందని, అందుకే ఢిల్లీ హైకోర్టును టార్గెట్ చేశామని మెయిల్‌లో వివరించారు. ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3ని పేల్చేస్తామన్నారు. జామ్‌నగర్ హౌజ్, ఝండేవాలన్ బిల్డింగ్ వంటివాటికి కూడా బాంబు ముప్పు ఉంది. ఈ బాంబు హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటించారు. బాంబు బెదిరింపులు ఉన్న ప్రదేశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గట్టి నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంట్రీ, ఎగ్జిట్ రూట్లలో తనిఖీలు చేపడుతున్నారు. ఇతర పబ్లిక్ ప్లేసులలో కూడా తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ హైకోర్టు, ఎయిర్‌పోర్టులలో భద్రతను మరింతకట్టుదిట్టం చేశారు. శనివారం, ఆగష్టు 15న ఢిల్లీలో స్వాతంత్ర్య దిన వేడుకలు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేడుకల కోసం ఢిల్లీ నగరంలోని ఎర్రకోట ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. వేడుకల కోసం మండి హౌజ్ మెట్రో స్టేషన్, ఐటీవో బిల్డింగులను అందంగా అలంకరించారు.

# నీటిని ఆపితే యుద్ధమే



ఇస్లామాబాద్:
నీరు మా రెడ్ లైన్ అని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారతదేశాన్ని మరోసారి హెచ్చరించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పాకిస్తాన్ నీటి ప్రతి చుక్కా మా రెడ్ లైన్ అని ప్రకటించారు. నీటిని ఆపితే యుద్ధమే అని అన్నారు. భారత్ సరైన మార్గానికి రాకపోతే నేరుగా ప్రతిస్పందన ఇస్తామని హెచ్చరించారు. 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసినందుకు ఆయన విమర్శించారు. గత సంవత్సరం యుద్ధంలో ఓటమి తర్వాత భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఈ ఒప్పందాన్ని నిలిపివేసి శాంతికి శత్రువుగా నిరూపించుకుందని అన్నారు. పాకిస్తాన్ శాంతిని కోరుతుందని కానీ దాన్ని బలహీనతగా భావించకూడదని చెప్పారు. సార్వభౌమత్వం లేదా భద్రతపై సవాలు వచ్చినట్లయితే బలమైన ప్రతిస్పందన ఇస్తామని హెచ్చరించారు.

## వికసిత్ భారత్ కోసం అందరూ పనిచేయాలి

-జాతినుద్దేశించి మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
-బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన జ్యోతిబా పూలే, సావిత్రిబాయి
-మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని ప్రశంసలు గుప్పించిన ముర్ము



న్యూఢిల్లీ:
రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వాతంత్ర్య దినోత్సవ సంధ్య వేళ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో దేశ పురోగతి, జాతీయ భద్రత, సామాజిక న్యాయం మరియు భవిష్యత్తు లక్ష్యాలను ప్రతిబింబించేలా సాగింది. దేశప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రారంభమైన ఈ సందేశంలో భారతదేశం సాధిస్తున్న సాంకేతిక, ఆర్థిక, సామాజిక విజయాలను ప్రస్తావించడంతో పాటు, రాబోయే దశాబ్దాల్లో దేశం అనుసరించాల్సిన వ్యూహాత్మక దిశానిర్దేశాన్ని స్పష్టం చేశారు. భారతదేశం తన స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే 2047 నాటికి దేశాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన గమ్యస్థానంగా (వికసిత్ భారత్) మార్చడమే మన ప్రాథమిక డిజైన్ అని రాష్ట్రపతి స్పష్టం చేశారు. సమగ్ర భాగస్వామ్యం: ఈ లక్ష్య సాధన కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు, వ్యవస్థ, రంగాలు భాగస్వామ్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్థిక నిలకడ మరియు సాంకేతికత: డిజిటల్ విప్లవం, హరిత ఇంధనం, స్టార్టప్ సంస్కృతి మరియు తయారీ రంగం భారత్‌ను ప్రపంచంలో కీలక ఆర్థిక శక్తిగా నిలబెడుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాల వేగవంతమైన పురోగతితో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే అందరికీ ఫలాలు అందే 'సమ్మేళన అభివృద్ధి' సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు.

# సొమ్మొకడిది సోకొకడిది అన్నట్లు ఉంది

మొదటి తరువాయి

పెంచాలని కోరాము. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు సాధ్యమైనన్ని ఎక్కువ నిర్మాణం చేయాలని కోరాము. దేశవ్యాప్తంగా కూడా ఈ సమస్య పరిష్కారం చేస్తామన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణం కోసం కేంద్రం డబ్బులు ఇస్తే కూడా కేసీఆర్ తీసుకోకుండా అహంకారపూరితంగా వ్యవహరించారు. రేవంత్ రెడ్డి డబ్బులు తీసుకున్నాడు కానీ ఇందిరమ్మ బొమ్మ మాత్రమే వేసుకుంటాడట అని అన్నారు. ఒక వైపు నిధులకోసం ఢిల్లీకి పోతున్నారు.. తెచ్చుకుంటున్నారు. కానీ కేంద్రం ఇస్తుంది అని మాత్రం బయటికి చెప్పడం లేదు అని అన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ కింద దేశవ్యాప్తంగా బిపిఎల్ కింద ఉన్న ప్రజలకు రేషన్ బియ్యం అందిస్తుంది. – మన రాష్ట్రంలో 57 లక్షల రేషన్ కార్డులు.. 1 కోటి 91 లక్షల మందికి 9 లక్షల 55 వేల మెట్రిక్ టన్నులు బియ్యం ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున 49.4 లక్షల రేషన్ కార్డులకు 1 కోటి 50 లక్షల మందికి 9 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇస్తుందన్నారు. రాష్ట్రం కంటే కేంద్రం ఎక్కువ మందికి బియ్యం ఇస్తుంది. మోడీ ప్రభుత్వం బియ్యం ఉచితంగా ఇస్తుంటే.. కార్డులు మాత్రం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు పెట్టి ఇస్తారట.. ఇదేం సంస్కారం. మీ తాత జాగీరా అని ప్రశ్నించారు. ఈ కార్డులు ఇవ్వడానికి ఆరు వందల కోట్లు ఖర్చు పెట్టారు. మీరు పోయి కొత్త ప్రభుత్వం వస్తే మళ్ళీ కార్డులు ఇస్తారా ? కార్డులు శాశ్వతంగా ఉంటాయి మీ ప్రభుత్వం కాదు అని ఆయన అన్నారు. ఇప్పుడు కార్డులు లేకపోయినా బియ్యం ఇస్తున్నారుగా.. ఎందుకు ఇంత ఖర్చు పెట్టడం మీ ఫోటోల కోసమా ? – భారత ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో అని రాసి ఫోటోలు లేకుండా కార్డులు ఇవ్వండి అని డిమాండ్ చేశారు.

# ఎర్రకోట ముస్తాబు

**--వందేమాతరంతో కొత్త శకం**
**-పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం**
**-ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు**
**-బస్తర్‌లోని 92 గ్రామాల్లో వేడుకలు**
**-ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం.. హైఅలర్ట్**



దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పలు ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ముఖ్యంగా 150 ఏళ్లు పూర్తి చేసుకున్న జాతీయ గీతం వందేమాతరం తొలిసారిగా ఎర్రకోట వేదికపై ఆలపించనుండటం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. యువత శక్తిని ప్రతిబింబించేలా ఈ ఏడాది వేడుకలకు యువ శక్తే ప్రధాన ఇతివృత్తంగా నిర్ణయించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తొలిసారిగా ఎర్రకోట ప్రాంగణంలో వందేమాతరాన్ని ఆలపించనున్నారు. ప్రధాని మోదీ ఎర్రకోటకు చేరుకున్న అనంతరం జాతీయ గీతం వందేమాతరంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం ప్రధాని జాతీయ జెండాను ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. స్వాతంత్ర్యోద్యమంలో కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరానికి ఈ ఏడాది 150 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. భారత వ్యోమనిక దళానికి చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ 150 ఏళ్ల వందేమాతరం స్మారక బ్యానర్ను మోసుకెళ్లడంతో పాటు ఎర్రకోట వద్దకు చేరుకున్న ప్రజలపై పూలవర్షం కురిపించనుంది.

**యువ శక్తికి పెద్దపీట**

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో యువత పాత్రను ప్రధానంగా ప్రస్తావించనున్నారు. దేశ ప్రగతిలో యువశక్తి చేస్తున్న కృషిని ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహిస్తున్నారు. 2026 అంతర్జాతీయ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లలో పతకాలు సాధించిన 19 మంది విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వీరిని ఎర్రకోట ప్రాకారంపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో కూర్చోబెట్టనున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ యువత సాధిస్తున్న విజయాలకు వీరి ప్రతిభను ప్రతీకగా చూపించనున్నారు.

**'సేవా తీర్థ్' స్ఫూర్తితో ఆహ్వానాలు**

ఈ ఏడాదీ స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సేవా తీర్థ్ ఇతివృత్తంతో ఆహ్వాన పత్రాలను రూపొందించారు. ప్రతి పౌరుడి సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలనే సందేశాన్ని ఇది అందిస్తోంది. ఆహ్వాన పత్రంలోని ధర్మచక్రం న్యాయబద్ధమైన కర్తవ్యాన్ని, నిరంతర నిస్వార్థ సేవను ప్రతిబింబించేలా రూపొందించారు. దేశం ముందు.. సేవా భావం, బాధ్యత, కర్తవ్యమే ప్రధానమనే సందేశాన్ని సేవా తీర్థద్వారా చాటుతున్నారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యాన్ని తెలియజేసేలా ఎర్రకోటలో ఈసారి ఏర్పాటు చేసిన సిట్టింగ్ ఎన్‌క్లోజర్లకు దేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లు పెట్టారు. పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**నక్సల్ ప్రభావిత గ్రామాల్లో తొలిసారి త్రివర్ణ పతాకం**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈసారి ఛత్తీస్‌గఢ్‌లోనూ ప్రత్యేకతను సంతరించుకోనున్నాయి. వామపక్ష తీవ్రవాదం నుంచి విముక్తి పొందిన ప్రాంతాల్లో తొలిసారిగా జాతీయ జెండా ఎగురవేయనున్నారు. మార్చి 31న ఛత్తీస్‌గఢ్‌ను వామపక్ష తీవ్రవాద రహిత రాష్ట్రంగా ప్రకటించిన నేపథ్యంలో ఈసారి తీర్థంగా యాత్రను గతంలో మావోయిస్టుల ప్రభావంలో ఉన్న మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లనున్నారు. బస్తర్ ప్రాంతంలోని 92 గ్రామాల్లో ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఒకప్పుడు మావోయిస్టు కార్యకలాపాలకు కేంద్రబిందువుగా ఉన్న ప్రాంతాల్లోనే ఇప్పుడు త్రివర్ణ పతాకం రెపరెపలాడనుండటం దేశంలో మారుతున్న పరిస్థితులకు ప్రతీకగా నిలవనుంది. మారుమూల గ్రామాలు, పాఠశాలల్లోనూ 'తిరంగా యాత్ర' నిర్వహించి ప్రజలను స్వాతంత్ర్య వేడుకల్లో భాగస్వాములను చేయనున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ అసెంబ్లీ ప్రాంగణాన్ని కూడా ప్రజల సందర్శనకు తెరవనున్నారు. ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు అసెంబ్లీ ప్రాంగణాన్ని సందర్శించేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ భవనాన్ని త్రివర్ణ రంగుల ప్రత్యేక లైటింగ్‌తో అలంకరించనున్నారు. బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బృందాలు దేశభక్తి గీతాలను ఆలపించనుండగా, సాహిత్య కళా పరిషత్ కళాకారులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సందర్శకులకు ముందస్తు రిజిస్ట్రేషన్ అవసరం లేదు. అయితే భద్రతా తనిఖీల అనంతరం మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. సందర్శకులు ఆధార్ వంటి చెల్లుబాటయ్యే గుర్తింపు పత్రాన్ని వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

**యువత నుంచి మారుమూల గ్రామాల వరకు..**

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేవలం ఢిల్లీలోని ఎర్రకోటకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో జరగనున్నాయి. ఒకవైపు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విజయాలు సాధిస్తున్న యువతకు గుర్తింపు లభిస్తుండగా.. మరోవైపు గతంలో మావోయిస్టుల ప్రభావంలో ఉన్న బస్తర్ వంటి ప్రాంతాల్లో త్రివర్ణ పతాకం రెపరెప లాడనుంది. యువ శక్తి నుంచి సేవా తీర్థ్ వరకు.. వందేమాతరం నుంచి బస్తర్ గ్రామాల్లో త్రివర్ణ పతాకం వరకు.. ఈ ఏడాది 80వ స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఐక్యత, యువత శక్తి, సేవా భావం, జాతీయ స్ఫూర్తికి ప్రతీకగా నిలవనుంది.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

మొదటి తరువాయి

జరగనుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు, వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు.

ఇందులో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. 22ఏ పరిధిలో కొన్ని వాస్తవమైన దరఖాస్తులున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ప్రభుత్వ, నిషేధిత జాబితాలో లేకుంటే, న్యాయస్థానాల్లో వివాదాల్లేని భూముల దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని అన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం కాదన్నారు. ఒక్క అంగుళం కూడా నష్టపోకుండా చూస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో ఉండే 46 మంది సబ్ రిజిస్ట్రార్లతో సమీక్ష చేశామనీ, 22ఏకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలిచ్చామని అన్నారు. ఏమైనా సమస్యలుంటే తన నెంబర్‌కు పంపాలనీ, వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**మంత్రివర్గ నిర్ణయాలివే...**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో 2.81 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. కొత్తగా కుటుంబీకుల పేర్లను కూడా నమోదు చేసింది. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో 3.42 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వారికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాల్లోనూ ఇన్‌చార్జి మంత్రులు పంపిణీ చేస్తారు.

**హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువు అక్టోబర్ 31 వరకు పెంపు**

హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను నగర శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో మూడు నెలలు రాష్ట్ర మంత్రివర్గం పొడిగించింది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

**7 రకాల సన్నాలకే రూ.500 బోనస్**

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుందని వివరించింది. ఈ ఏడాది నుంచి ఆ ఏడు రకాల సన్నాలకే మద్దతుధరతోపాటు రూ.500 బోనస్ చెల్లించాలని తీర్మానించింది.

**మిగులు ధాన్యం ఈ-వేలం**

యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని మంత్రివర్గం తెలిపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసిందని పేర్కొంది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరించింది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2,389 కనీస ధర నిర్ణయించి ఈ వేలం ద్వారా అమ్మాలని నిర్ణయించింది.

**శక్తి శాఖ పరిధిలోకి స్కిల్స్ వర్సిటీ**


రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేవడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉన్నాయి. వాటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వాటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది.

# పూలే ఆశయాలు కొనసాగిస్తాం

మొదటి తరువాయి

గాంధీ, మరో వైపు పీవీ నరసింహారావు, మరో వైపు జ్యోతి బాపూలే లివిగ్రహాలను ఇక్కడ ఆవిష్కరించుకున్నాం అని అన్నారు..లి వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలి, సక్సెస్ రోడ్డు చౌరస్తా ఇప్పుడు అద్భుతమైన చౌరస్తా గా మారిందన్నారు. రాజ్యాంగాన్ని ఓటు హక్కు ఇచ్చిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఇక్కడ ఆవిష్కరించబడింది. 150 యేళ్ల క్రితం జ్యోతి బా పూలే చదువు ఒక్కటే మార్గమని తన చదువుకోవడమే కాకుండా తన సతీమణిని చదివించడం ద్వారా ఆదర్శంగా నిలబడ్డారు అని గుర్తు చేశారు. మా ప్రభుత్వంలో లిజ్యోతి బా పూలే ఆలోచనలను కొనసాగిస్తున్నాం.. చదువులు ఒక్కటే ఆత్మగౌరవాన్ని గుర్తింపును ఇస్తుంది. తలెత్తుకునేలా చేస్తుందన్నారు. కుల నిర్మూలన జరగాలంటే, సామాజిక చైతన్యం కావాలంటే అందరు కలిసి కట్టుగా చదువుకోవడం, జీవించడం ద్వారా సాధ్యం అవుతుందన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తీసుకు వస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నాం. నర్సరీ నుంచి బ్రేక్ ఫాస్ట్ తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం అని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 2400 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌ను అడ్వాన్స్ గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తున్నాం. పారదర్శకంగా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తాం అని హామీ ఇచ్చారు. ప్రతియేడాది 2300 వేల కోట్ల రూపాయలను విద్యార్థుల ఖాతాల్లోకి ఫీజు రీయింబర్స్ మెంట్ వేస్తాం అని అన్నారు. 250 కోట్లు అడ్వాన్స్ గా పెట్టాం. ఆన్ లైన్ లో అప్లై చేసుకుంటే నెలలో ఫీజు రీయింబర్స్ మెంట్ విద్యార్థుల ఖాతాల్లో పడుతుంది. ఫీజులు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వమని ఏ కాలేజీ చెప్పకుండా ముందుగానే ఫీజులు చెల్లిస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ సర్టిఫికెట్, డాక్టర్ సర్టిఫికెట్ లో ఉంటే.. ఇప్పుడు సర్టిఫికెట్ ఉంటే సరిపోదు. నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులకు విద్య తో పాటు స్కిల్స్ నేర్పిస్తున్నాం అని అన్నారు.

# ఆగష్టు చివరి వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం



న్యూఢిల్లీ:
ప్రస్తుతం దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు కనిపిస్తోంది. అయితే, వానాకాలంలో భారీ వర్షాలు నమోదయ్యేది ఆగష్టులోనే. అందుకే ఈ నెలలో కూడా దేశంలో భారీ వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాతావరణం వర్షాలకు అనుకూలంగా ఉందని యురోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్ట్ (ఈసీఎండబ్ల్యూఎఫ్) సంస్థ ప్రకటించింది. ఈ సంస్థ అంచనా ప్రకారం వచ్చే 15 రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో తగినంత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.ముఖ్యంగా సెంట్రల్ ఇండియాతోపాటు దేశంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతాన్ని ఈ సీజన్ రెయిన్ ఫ్యాక్టరీ అంటారు. ఈ కాలంలో వర్షాలకు కారణమయ్యేది ఇదే. దీనికి అనుగుణంగా ప్రస్తుతం అనేక అల్పపీడన వ్యవస్తలు బంగాళాఖాతంలో భారీ సంఖ్యలో, ఒకదాని తర్వాత ఒకటి ఏర్పడుతున్నాయి. వీటివల్లే దేశంలో వర్షాలకు ఛాన్స్ ఉంది. ఈ అల్పపీడన వ్యవస్థలు మెల్లిగా దేశంలోకి కదులుతాయి. వీటివల్ల ఇప్పటికే ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌తోపాటు ఈశాన్య భారతదేశంలో తేమ శాతం పెరిగింది. ఈ కారణంగా ఆగష్టు చివరివారం వరకు వర్షాలకు ఛాన్స్ ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో కారణంగా దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్తితులు ఏర్పడ్డాయి. దీంతో అనేక చోట్ల కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. అందువల్ల బంగాళాఖాతంలో ఏర్పడ్డ వ్యవస్తల వల్ల వర్షాలు కురిస్తే, పరిస్తితుల్లో మార్పు రావొచ్చు. వర్షపు లోటు తగ్గవచ్చు.

# అన్నసాగర్ ఎంపీపీఎస్ విద్యార్థులకు ఐడీ కార్డుల విరాళం

-విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పెరుగు వెంకటరమణ సేవాభావం



**ఎల్లారెడ్డి, ఆగస్టు 14, (మహాప్రభ)**

అన్నసాగర్ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పెరుగు వెంకటరమణ ఐడెంటిటీ కార్డులను విరాళంగా అందజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సొంత గ్రామంలోని విద్యార్థులపై ఉన్న అభిమానంతో పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయ బృందం పేర్కొంది. విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు పాఠశాల గుర్తింపును పెంపొందించేందుకు ఐడీ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థుల పట్ల పెరుగు వెంకటరమణకు ఉన్న ఆదరాభిమానాలు, సేవాభావాన్ని పాఠశాల తరపున ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

# ఎల్లారెడ్డిలో ఘనంగా తిరంగా ర్యాలీ

-స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం





**ఎల్లారెడ్డి, ఆగస్టు 14, (మహాప్రభ):** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఎల్లారెడ్డి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. రామాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా శివాజీ విగ్రహం వరకు కొనసాగింది. జాతీయ జెండాలు చేతబూని దేశభక్తి నినాదాలతో నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలువురు దుకాణదారులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ బత్తిని దేవేందర్, పట్టణ అధ్యక్షుడు ఏడీ రాజేష్, మండల అధ్యక్షుడు పెద్దేడ్ల నర్సింలు, సాయిరెడ్డి, అశోక్, కాశీనాథ్, సత్యం, శివ, రాజు, సాయిలు, సర్వేంద్ శ్రీనివాస్, తులసి, బబ్లు, కౌశిక్, ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం


-మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మదన్ మోహన్




**ఎల్లారెడ్డి, ఆగస్టు 14, (మహాప్రభ)**

మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు, 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గత పదేళ్లుగా సొంత ఖర్చులతో జాబ్ మేళాలు నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లభిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొంటూ, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎనిమిది మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### దేవరకద్ర మున్సిపాలిటీలోని ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని అఖండ దీపారాధన





**దేవరకద్ర ఆగస్టు 14 మహాప్రభ**

దేవరకద్ర నియోజకవర్గంలోని శ్రీశ్రీశ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని అఖండ దీపారాధన అఖండ భజన కార్యక్రమం ప్రారంభమైనవి ఈ సందర్భంగా ఆలయంలో తొలి శుక్రవారం పురస్కరించుకొని గోమాత పూజ చేశారు ఈ సందర్భంగా ఆలయం అధికారి ఈవో శివానంద చారి మాట్లాడుతూ ఈ ఆలయంలో ప్రతిరోజు అఖండ భజన అఖండ దీపారాధన ఆనవాయిదిగా వస్తుంది శ్రీశ్రీశ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవరకద్ర గ్రామ ప్రజల ఆరాధ్య దైవం ఆలయ అర్చకులు నాగరాజు స్వామి భూషణ్ స్వామి

# పెద్దవంగరలో ప్రతి సోమవారం ప్రజావాణి

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయం



**పెద్దవంగర, ఆగస్టు 14 (మహాప్రభ):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు పెద్దవంగర మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం కొనసాగనుంది. ఎంపీడీవో నోడల్ అధికారిగా వ్యవహరించనుండగా రెవెన్యూ, పంచాయతీ, వ్యవసాయం, వైద్యం, విద్య, విద్యుత్, పౌరసరఫరాలు, సంక్షేమం, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ తదితర 26 శాఖల అధికారులు అందుబాటులో ఉంటారు.ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి గ్రీవెన్స్ ఐడీతో రసీదు అందజేస్తారు. సంబంధిత శాఖలకు ఫిర్యాదులను పంపి పరిష్కారాన్ని పర్యవేక్షించనున్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఆధారాలు, పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా క్రీడా పోటీలు






**తూప్రాన్ ఆగస్టు14,(మహాప్రభ)** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రభావతి, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభావతి గారు మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరియు శారీరక దృఢత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. క్రీడా పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధ్యాపకులు మరియు కళాశాల సిబ్బంది సహకరించారు.

# పెళ్లికి పుస్తే మెట్టెలు అందజేసిన బి.ఆర్.ఎస్ పార్టీ

-సీనియర్ నాయకులు మందడి సరోజ్ రెడ్డి



**దేవరకద్ర ఆగస్టు 14 మహా ప్రభ**

దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కమలేశ వివాహానికి పుస్తె మెట్టెలు అందజేసిన బీ.ఆర్.
ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హైకోర్టు అడ్వకేట్ మందడి సరోజిరెడ్డి ఈ సందర్భంగా బీద ప్రజలకు కార్యకర్తలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు

# దేవరకద్ర మున్సిపాలిటీలోని దోమల మందు ఫాగింగ్



**దేవరకద్ర ఆగస్టు 14 మహాప్రభ**

దేవరకద్ర మున్సిపాలిటీలోని దోమల మందు ఫాగింగ్ చేశారు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉండటం వల్ల దోమల మందు ఫాగింగ్ చేశారు మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి వార్డ్ కౌన్సిలర్ల ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది దోమల మందు ప్రతి వార్డులో ఫాగింగ్ చేశారు ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ ఉమా రాజు ఏడవ వార్డు కౌన్సిలర్ కురువ బీరప్ప మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## దేవరకద్ర మున్సిపాలిటీలో క్రీడల మినీ స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన అధికారులు







**దేవరకద్ర ఆగస్టు 14 మహా ప్రభ** దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని చౌదర్పల్లి శివారులో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది సర్వేనెంబర్ 299/1 లో కేటాయించిన 9 ఎకరాల 16 గుంటల భూమిని నేడు మహబూబ్నగర్ ( డి వై ఎస్ ఓ ) రాజశేఖర్ మున్సిపాలిటీ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి తో కలిసిఅధికారులు పరిశీలించారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు క్రీడాకారులకు యువకులకు మెరుగైన క్రీడా వసతులు కల్పించా లనే ఉద్దేశంతో ప్రభుత్వం మినీ స్టేడియాన్ని మంజూరు చేసిందని తెలిపారు ఈ స్థల పరిశీలనలో భాగంగా స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు సౌకర్యాల గురించి అధికారులతో చర్చించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహేష్ 2 వా వార్డ్ కౌన్సిలర్ భీమన్న తదితర అధికారులు పాల్గొన్నారు ఈ మినీ స్టేడియం అతి త్వరలోనే పనులు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి అధికారులు తెలిపారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

--ఎల్లారెడ్డి అభివృద్ధిపై సమీక్షలో ఎమ్మెల్యే మదన్ మోహన్ సూచన





**ఎల్లారెడ్డి, ఆగస్టు 14, (మహాప్రభ)** : ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ సేవల అమలు, వివిధ శాఖల పనితీరుపై ఎమ్మెల్యే మదన్ మోహన్ ఎల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఆర్ఓ, ఎంపీడీఓ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్యుత్, విద్యాశాఖ, బీసీ సంక్షేమ శాఖ, బీసీ వెల్ఫేర్, గురుకుల హాస్టళ్ల అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల పురోగతి, రహదారులు, మౌలిక వసతులు, విద్యుత్ సమస్యలు, పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఎమ్మెల్యే అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

# జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు.

-జిల్లాలో మొత్తం 2403 మెట్రిక్ టన్నుల యూరియా.

-జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్



**మెదక్ జిల్లా -14ఆగస్ట్ (మహాప్రభ ).**

జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ శుక్రవారం ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో మొత్తం 2403 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ అందుబాటులో ఉంది. ఇందులో మార్క్‌ఫెడ్ వద్ద 1855 మెట్రిక్ టన్నులు మరియు రిటైలర్ల వద్ద 548 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. .07.08.2026 నుండి రైతులు ఖీూా యాప్ ద్వారా యూరియాను కొనుగోలు చేస్తున్నారు. అని తెలిపారు.. రైతులు ఖీూా యాప్ ద్వారా వచ్చిన మొత్తం యూరియా పరిమాణానికి సంబంధించి బుకింగ్ చేస్తున్నట్లు.వివరించారు. ప్రతిరోజూ యూరియా స్టాక్‌ను అందుబాటులో ఉంచుతున్నాము. అని తెలిపారు. రిటైలర్ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్లు మరియు రైతు వేదికల వద్ద ఉన్న ఏ ఇ ఓ లు రైతులకు ఎఫ్ యస్ యస్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. అని తెలిపారు.ఎఫ్ యస్ యస్ యాప్‌ను వినియోగించడంలో ఇబ్బంది పడుతున్న రైతులకు బుకింగ్ చేయడంలో సహాయం అందిస్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

# పట్టణ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి





**- ఎమ్మెల్యే బాలు నాయక్**

**-మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్‌పై సమీక్ష**

**దేవరకొండ ఆగస్టు 14( మహాప్రభ )**

దేవరకొండ మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హాజరై పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై అధికారులు, మున్సిపల్ సభ్యులతో సమీక్షించారు. సమావేశంలో ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ లైన్లు, పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డు, ఎస్‌టీపీ (ఎస్.టి.పి.), వెట్‌వెల్స్, మున్సిపల్ పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అవసరమైన రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టడంతో పాటు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సమావేశంలో చర్చించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిరంతర విద్యుత్, వీధి దీపాల సౌకర్యం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే 1.50 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్‌టీపీ, వెట్‌వెల్‌లకు సంబంధించిన పనులు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డు అభివృద్ధి తదితర అంశాలను కూడా సమావేశంలో సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పారిశుధ్య కార్యక్రమాలను మరింత పటిష్టంగా నిర్వహించాలని చర్చించారు. పట్టణంలో జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన అంశంతో పాటు వీధి కుక్కల నియంత్రణ, జంతు సంక్షేమ చర్యలపైనా సమావేశంలో చర్చ జరిగింది. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ.. "దేవరకొండ పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి" అని అన్నారు. 'ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దేవరకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి" అని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, ఛైర్పర్సన్ పున్న శైలజ-వెంకటేశ్వర్లు, మహ్మద్ జూవేరియా జువేరియా తబస్సుం-సమీర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పాల్గొని పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు

## కంటి వెలుగులు పంచిన ఉచిత వైద్య శిబిరం

**-80 మందికి కంటి పరీక్షలు..**

**- 30 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తింపు**

**-సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్ యాదవ్**



**పెద్దవంగర ఆగస్టు 14:**

మండలంలోని అవుతాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హనుమకొండకు చెందిన శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సహకారంతో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 80 మందికి పరీక్షలు చేయగా, వారిలో 30 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమున్నట్లు వైద్యులు గుర్తించారు. శస్త్రచికిత్స అవసరమున్న వారిని హనుమకొండకు తీసుకెళ్లి కంటి ఆపరేషన్లు చేయించి, అనంతరం తిరిగి వారి ఇళ్లకు చేర్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తమ గ్రామానికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందించిన శరత్ మాక్సివిజన్ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పావని, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి రామ్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పిల్లలకు యూనిఫామ్ ప్లేట్లు పంపిణీ.



**మనోహరాబాద్, ఆగస్టు 14 (మహాప్రభ)**

శుక్రవారం మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ జిల్లా నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా లక్ష్మీ రామ్ రెడ్డి సేవా ట్రస్ట్ ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు, ప్లేట్లు, ఆట వస్తువులు వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. దండుపల్లి గ్రామ సర్పంచ్ మరాఠీ నాగరాజు పాలకవర్గం ఆధ్వర్యంలో ఈ ప్లేట్ల పంపిన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నేత మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ దండుపల్లి గ్రామంతో మనోహరాబాద్ గ్రామానికి విడదీయరాని బంధం ఏర్పడిందని ఇక్కడున్న ప్రతి ఒక్కరు నా ఆత్మీయులేనని అన్నారు. పాఠశాల విద్యార్థులకు ఇంకేమైనా అసౌకర్యాలు ఉన్న నా దృష్టికి తీసుకురావాలని నేను తక్షణమే సమస్యలపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు పంజా బీక్షపతి, గడ్డి వెంకటేష్ యాదవ్, శశిభూషణ్ రెడ్డి, జావెద్ పాషా, గ్రామ సెక్రెటరీ, ఉపసర్పంచ్ నాగమణి, వార్డు సభ్యులు సురేష్ కుమార్, ఎల్లం, దీపిక, స్వాతి, నరేష్, స్వరూప, మనీషా, సురేష్, ఉదయ్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు ఉన్నారు.

## ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నాం..

**-మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**





దేవరకొండ ఆగస్టు 14( మహాప్రభ )

దేవరకొండ పట్టణంలోని 7వ వార్డులో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ "మార్నింగ్ వాక్ విత్ పీపుల్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. రూ.70 లక్షలు, రూ.50 లక్షలు, రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించి, వాటి నాణ్యత, ప్రజలకు అందుతున్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలోని కుటుంబాలను స్వయంగా కలిసి వారి సమస్యలను ఎమ్మెల్యే బాలు నాయక్ నేరుగా తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంకా అవసరమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి వసతులు, మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణం తదితర అంశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మీడియాతో మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, పట్టణాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గాలను చూపించడమే 'మార్నింగ్ వాక్ విత్ పీపుల్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. దేవరకొండ పట్టణంలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నాం" అని తెలిపారు. 'ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటాం. దేవరకొండ పట్టణంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే మా లక్ష్యం. అవసరమైన ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతాం. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటాం" అని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ హనుమంతు సాయి చంద్ర గౌడ్, మాజీ చైర్పర్సన్ ఆలంపల్లి నరసింహ, ఎంఎ సిరాజ్ ఖాన్, హనుమంతు వెంకటేష్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, మారుపాకుల సురేష్ గౌడ్, కిన్నెర హరికృష్ణ, ప్రజా ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కల్లు రూపా రెడ్డి మృతిబాధాకరం

**-దేవరకొండ మాజీశాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.**

**దేవరకొండ డివిజన్ ఆగస్టు 14 (మహాప్రభ)**



కొండమల్లెపల్లి పట్టణంలోని నాగార్జున గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపా రెడ్డి మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గుర్రంగూడలో కల్లు రూపా రెడ్డి మృతదేహానికి రమావత్ రవీంద్ర కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రూపా రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో ధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## డా.నక్క అఖిలేష్ యాదవ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు



**దేవరకొండ ఆగస్టు 14( మహా ప్రభ)**

డా. నక్క అఖిలేష్ యాదవ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా నక్క అఖిలేష్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పణతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. నక్క అఖిలేష్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, డా. నక్క అఖిలేష్ యాదవ్ సేవా స్ఫూర్తి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలోని పేదలు, నిరుపేదలకు అండగా నిలవడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అఖిలేష్ యాదవ్ జ్ఞాపకాలను స్మరించుకుంటూ భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు మరియు స్థానికులు పాల్గొని డా. నక్క అఖిలేష్ యాదవ్ స్మృతులకు ఘన నివాళులు అర్పించారు.

## విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా

**-రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కులు అందజేసిన మదన్ మోహన్**



**ఎల్లారెడ్డి, ఆగస్టు 14, (మహాప్రభ)**



ఎల్లారెడ్డి నియోజకవర్గంలో విద్యుత్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ప్రమాద బీమా పరిహారానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే మదన్ మోహన్ పంపిణీ చేశారు. లబ్ధిదారులైన లింగంపల్లి కలాన్‌కు చెందిన అల్లాపురం లక్ష్మి, మాచాపూర్‌కు చెందిన కొండా సునీత, సాతెల్లికి చెందిన ఎర్కల రవి చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ.. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ప్రజల కష్టాల్లో వారికి అండగా నిలిచి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని సతీ సమేతంగా అలంపూర్ జోగులాంబను దర్శించు కొని పూజలు చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి దంపతులు**

**దేవరకద్ర ఆగస్టు 14 మహా ప్రభ**



పవిత్రమైన శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి దంపతులు అష్టాదశ శక్తి పీఠము లో ఒకటైన అల్లంపూర్ జోగులాంబ అమ్మవారిని శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామిని శుక్రవారం నాడు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆలయ అధికారులు అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేయించారు అమ్మవారికి కుంకుమార్చన చేశారు అర్చకులు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# హర్ ఘర్ తిరంగా

**- కార్యక్రమం ఘనంగా జరిగింది**



**దేవరకొండ ఆగస్టు 14( మహాప్రభ )**
భారతీయ జనతా పార్టీ దేవరకొండ మండల అధ్యక్షుడు నేనావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో బొడ్డుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నేనావత్ రాము నాయక్ మాట్లాడుతూ... జాతీయ జెండా మన దేశ గౌరవానికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు, భారతీయుల ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని, చిన్నారుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. మన జాతీయ జెండాలోని మూడు రంగులు భారతదేశ గొప్పతనాన్ని, త్యాగాన్ని, శాంతిని, అభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయని వివరించారు. “తిరంగా మన గర్వం... భారతదేశం మన గౌరవం” అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జనరల్ సెక్రెటరీ చనమోని రాములు , ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు వినోద్ రాథోడ్ , మండల ఉపాధ్యక్షులు కద్దాల బాలస్వామి ,ఉపాధ్యక్షులు నేనావత్ శంకర్ నాయక్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి ఎస్టీ బాలికల పాఠశాలలో హెచ్‌పీవీ టీకాలు



**ఎల్లారెడ్డి, ఆగస్టు 14, (మహాప్రభ)**
ఎల్లారెడ్డిలోని గిరిజన బాలికల పాఠశాలలో విద్యార్థినులకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మాథ్మల్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శరత్ ఆధ్వర్యంలో వైద్య బృందం విద్యార్థినులకు సిఫార్సు చేసిన టీకాల షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించింది. తల్లిదండ్రుల నుంచి అవసరమైన సమ్మతి తీసుకున్న అనంతరం టీకాలను సురక్షితంగా వేశారు. టీకాల అనంతరం విద్యార్థినులను వైద్య బృందం పరిశీలించి, తక్షణ ప్రతికూల ప్రభావాలు ఏమైనా ఉన్నాయా అని పర్యవేక్షించింది. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణలో హెచ్‌పీవీ టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్య సిబ్బందిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

# అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**-డీఈఓ దిష్టిబొమ్మ దహనం చేసిన ఏబీవీపీ**



**ఎల్లారెడ్డి, ఆగస్టు 14, (మహాప్రభ):**
కామారెడ్డి జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పట్టణంలో డీఈఓ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఎన్ఓసీలు, మున్సిపల్ అనుమతులు, ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా డీఈఓ నుంచి సరైన స్పందన లేదని విమర్శించారు. విద్యార్థుల భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇకనైనా స్పందించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేని పాఠశాలలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవడంతో పాటు, నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజశేఖర్, కౌశిక్, వెంకటేష్, సాయి తేజ, చరణ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మ బొరుసు ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి.

**-13 మంది అరెస్ట్.. 6 గురు పరారీ.**

**-14 మొబైల్ ఫోన్లు, రూ.55,375 నగదు స్వాధీనం**

**-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్**



**మెదక్ జిల్లా -14ఆగస్ట్ (మహాప్రభ ).**
అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కె.ఎన్.ఆర్. క్రషర్ వెనుక బొమ్మ బొరుసు ఆడుతున్న స్థావరంపై మెదక్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిఘా ఏర్పాటు చేసి, బొమ్మ బొరుసు ఆడుతున్న స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో బొమ్మ బొరుసు ఆడుతున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో 6 గురు పోలీసులను చూసి అక్కడి నుంచి పరారైనట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 14 మొబైల్ ఫోన్లు, రూ. 55,375 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బొమ్మ బొరుసు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

# ప్రజలకు చేరే ప్రతి ప్రభుత్వ పథకం..






**- గ్రామ అభివృద్ధికి దోహదపడాలి: ఎమ్మెల్యే బాలు నాయక్**

**-అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే మండల, గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యం..**

**దేవరకొండ ఆగస్టు 14( మహాప్రభ )**
దేవరకొండ మండల స్థాయి సమీక్ష సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని మండలంలోని వివిధ శాఖల పనితీరు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై సమగ్రంగా సమీక్షించారు. మండల స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు.
ఈ సందర్భంగా “పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, వ్యవసాయం, ఉద్యానవనం, పౌరసరఫరాలు, ఉపాధి హామీ, విద్య, వైద్య--ఆరోగ్య, మహిళా--శిశు సంక్షేమం, విద్యుత్, మిషన్ భగీరథ, నీటిపారుదల, గిరిజన సంక్షేమం తదితర శాఖల ద్వారా మండలంలో అమలవుతున్న కార్యక్రమాలను ఎమ్మెల్యే సమీక్షించారు. గ్రామపంచాయతీల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, గ్రామీణ రహదారులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వి.బి. జిఆర్ ఎ యం జి.ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాలకు శాశ్వత ఆస్తులు సమకూరేలా పనులను ఎంపిక చేయాలని సూచించారు. చెరువుల పూడికతీత, కాలువల అభివృద్ధి, మొక్కల పెంపకం, గ్రామీణ రహదారులు, ఇతర అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రైతులకు అవసరమైన “”విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పంటల సాగుపై సలహాలు, వ్యవసాయ శాఖ సేవలు సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ సక్రమంగా అందేలా చూడాలని అన్నారు. మండల కార్యాలయాల్లో జరిగే సమీక్షలు కేవలం సమావేశాలకే పరిమితం కాకూడదు. సమావేశంలో తీసుకున్న ప్రతి నిర్ణయం గ్రామస్థాయిలో అమలయ్యేలా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలి. ప్రజల సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపించడమే సమీక్ష సమావేశాల అసలు ఉద్దేశం” అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. “ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరాలి. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పనులు చేపట్టాలి” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, ప్రజల నుంచి వచ్చే సమస్యలపై వేగంగా స్పందించాలని ఆదేశించారు.
“దేవరకొండ మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమం అందాలి.. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడాలి. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తే అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది”అని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో, డిఎల్పిఓ, మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ అధికారులు, సర్పంచులు

# పెద్దవంగరలో మహిళలకు రక్షణ ఎక్కడ?

**-మండల కేంద్రం విస్తరిస్తున్నా.. మహిళల కనీస అవసరాలకు దిక్కేది?**

**-ప్రభుత్వ కార్యాలయాలు.. బ్యాంకులు.. మార్కెట్‌కు వచ్చే మహిళలకు తీవ్ర ఇబ్బందులు**

**-పబ్లిక్ టాయిలెట్లు లేక అవస్థలు --- మహిళల భద్రతపై ప్రశ్నార్థకం**







**పెద్దవంగర, ఆగస్టు 14 (మహాప్రభ):**
మండల కేంద్రంగా పెద్దవంగర ప్రత్యేక గుర్తింపు పొందినప్పటి నుంచి పట్టణం క్రమంగా అభివృద్ధి చెందుతోంది. మండల రెవెన్యూ కార్యాలయం (తహసీల్దార్ కార్యాలయం), ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్, బ్యాంకులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ఎరువుల దుకాణాలు, గ్రోమోర్ కేంద్రం, వివిధ రకాల వ్యాపార సంస్థలు ఏర్పాటయ్యాయి. ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంతకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. అయితే ఇంతటి రద్దీ ఉన్న మండల కేంద్రంలో మహిళల కనీస అవసరాలను తీర్చే పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా శుక్రవారం సంత రోజున మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే తల్లులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

మహిళల భద్రతపై ప్రశ్నార్థకం
ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజూ అనేక మంది మహిళలు మండల కేంద్రానికి వస్తుంటారు. బ్యాంకులు, రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉంటాయి. కానీ అత్యవసర సమయంలో ఉపయోగించుకునేందుకు సౌకర్యవంతమైన, పరిశుభ్రమైన పబ్లిక్ టాయిలెట్ సదుపాయం లేకపోవడం మహిళలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అదేవిధంగా రద్దీ ప్రాంతాల్లో మహిళలకు తగిన భద్రతా చర్యలు, తగిన వెలుతురు, అవసరమైన చోట్ల నిఘా వ్యవస్థ వంటి అంశాలపై కూడా సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి అంటే భవనాలు మాత్రమేనా?
మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు పెరగడం, వ్యాపార కార్యకలాపాలు విస్తరించడం అభివృద్ధికి సంకేతమే. కానీ ప్రజల కనీస అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఆ అభివృద్ధి అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.
మహిళల కోసం ప్రత్యేకంగా పరిశుభ్రమైన పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇకనైనా అధికారులు స్పందించాలి
మండల కేంద్రానికి నిత్యం వచ్చే ప్రజల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఉపయోగించుకునేలా ప్రత్యేక ప్రజా మరుగుదొడ్లను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా వారాంతపు సంత జరిగే ప్రాంతంలో తాత్కాలికంగా అయినా మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.
మహిళలకు గౌరవం.. భద్రత.. కనీస సౌకర్యాలు కల్పించడమే నిజమైన అభివృద్ధికి కొలమానం. పెద్దవంగర మండల కేంద్రంలో నెలకొన్న ఈ సమస్యపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# ఘనంగా డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా



**దేవరకొండ ఆగస్టు 14( మహా ప్రభ)**
మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో ఎన్ సి సి విభాగం సి టి ఓ జి. కోటయ్య ఆధ్వర్యంలో “హర్ ఘర్ తిరంగా” అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేమాతర గీతాన్ని ఆలపించి దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ దేశంలోని పౌరులందరూ తమ తమ ఇళ్ల పైన జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుతూ మన దేశ ఐక్యమత్యాన్ని ప్రపంచానికి సాటి చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి. లింగారెడ్డి, డా కె.రేణుక తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు ఎన్సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల బలోపేతానికి సమష్టి కృషి

**శ్రీతులసి మండల సమాఖ్య 10వ వార్షిక మహాసభ**



**పెద్దవంగర, ఆగస్టు 14 (మహాప్రభ):**
పెద్దవంగర మండల కేంద్రంలో శ్రీతులసి మండల సమాఖ్య 10వ వార్షిక మహాసభను సమాఖ్య అధ్యక్షురాలు జి.భద్రమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వార్షిక ఆడిట్ నివేదికను చదివి వినిపించడంతో పాటు, సెర్ప్ కార్యక్రమాల ప్రగతి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ముఖ్య అతిథిగా పెద్దవంగర గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత హాజరై మహిళా సంఘాల అభివృద్ధికి సూచనలు చేశారు. అనంతరం మండల సమాఖ్య నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి అనూష, కోశాధికారి సునీత, ఏపీఎం పాషా, శ్రీనిధి మేనేజర్ సంధ్య, సీసీలు సుజాత, ఉమారాణి, సుధాకర్, ఎంఎస్ఏ ఆశాలతతో పాటు వివిధ గ్రామాల వీవో అధ్యక్షులు, వీవోఏలు, మార్గదర్శకులు, బీడీఎస్పీలు, కార్యదర్శులు, కోశాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## తగ్గిన బంగారం ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, డాలర్ మారకం విలువలో మార్పులు వంటి అంశాల ప్రభావంతో దేశీయంగా పసిడి ధరల్లో కదలికలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.710 తగ్గి రూ.1,52,890కు చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర కూడా తగ్గింది. 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.650 తగ్గి రూ.1,40,150 వద్ద నమోదైంది. ఇక వెండి ధరలో మాత్రం శుక్రవారం ఎలాంటి మార్పు కనిపించలేదు. గత ధర వద్దనే వెండి కొనసాగింది. బంగారం ధరలు తగ్గినప్పటికీ, వెండి ధర స్థిరంగా ఉండటం మార్కెట్‌లో మిశ్రమ పరిస్థితులను సూచిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్ తదితర నగరాల్లో స్థానిక పన్నులు, నగల తయారీ ఛార్జీలు, డిమాండ్ వంటి కారణాలతో బంగారం ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉంది. అలాగే ఆభరణాలు కొనుగోలు చేసే సమయంలో ప్రకటించిన బంగారం ధరకు అదనంగా మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ వంటి ఇతర ఖర్చులు వర్తించవచ్చు. పసిడి ధరలు రోజువారీగా మారే అవకాశం ఉన్నందున కొనుగోలుదారులు ఆభరణాలు లేదా బంగారం కొనుగోలు చేసే ముందు స్థానిక బులియన్ మార్కెట్‌లో తాజా ధరలను నిర్ధారించుకోవడం మంచిది.

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీలు రోజంతా ఒడిదుడుకుల మధ్య కొనసాగి, చివరకు ఎరుపు రంగులోనే స్థిరపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 70.71 పాయింట్లు, 0.09 శాతం నష్టపోయి 78,009.25 వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 29.85 పాయింట్లు, 0.12 శాతం క్షీణించి 24,366.00 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో ఎంపిక చేసిన భారీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించడం సూచీలపై ప్రభావం చూపింది. సెన్సెక్స్‌లో ఏషియన్ పెయింట్స్, ఇండిగో, ఎన్టీపీసీ తదితర షేర్లు నష్టాలతో ముగియగా, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్ వంటి షేర్లు లాభాలను నమోదు చేశాయి. దీంతో సూచీలు పెద్దగా పతనం కాకపోయినా, రోజంతా ప్రతికూల ధోరణి కొనసాగింది. విదేశీ మారక మార్కెట్‌లోనూ రూపాయిపై ఒత్తిడి కొనసాగింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.43గా నమోదైంది. దిగుమతుల వ్యయం, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు వంటి అంశాలు రూపాయి కదలికలపై ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కూడా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 87 డాలర్ల వద్ద కొనసాగుతోంది. చమురు ధరల్లో మార్పులు భారత్ వంటి చమురు దిగుమతి ఆధారిత దేశాల ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు, రూపాయి విలువతో పాటు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. మొత్తంగా, దేశీయ మార్కెట్లు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిసినప్పటికీ, సూచీల పతనం పరిమితంగానే ఉంది. రాబోయే సెషన్లలో అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, ముడి చమురు ధరలు, రూపాయి మారకం విలువ, విదేశీ పెట్టుబడుల ప్రవాహం వంటి అంశాలు మార్కెట్ దిశను నిర్ణయించడంలో కీలకంగా మారనున్నాయి.


## రూ.5 వేలు తగ్గిన కేజీ వెండి ధర




హైదరాబాద్‌లో బంగారం, వెండి ధరలు శుక్రవారం గణనీయంగా తగ్గాయి. ముఖ్యంగా వెండి ధరలో భారీ క్షీణత నమోదైంది. కేజీ వెండి ధర రూ.5,000 తగ్గి రూ.2.55 లక్షలకు చేరింది. వెండి ధర తగ్గడంతో కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించింది. బంగారం ధరల్లోనూ తగ్గుదల నమోదైంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.710 తగ్గి రూ.1,52,890కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా తగ్గి రూ.1,40,150 వద్ద నమోదైంది. ఇటీవల బంగారం, వెండి ధరల్లో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉన్నాయి. డాలర్ మారకం విలువ, అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లలో ధరల కదలికలు, పెట్టుబడిదారుల డిమాండ్ వంటి అంశాలు విలువైన లోహాల ధరలను ప్రభావితం చేస్తుంటాయి. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ఇతర నగరాల్లో స్థానిక మార్కెట్ పరిస్థితులు, పన్నులు, డిమాండ్ తదితర కారణాలతో ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండవచ్చు. ఆభరణాల కొనుగోలు సమయంలో బంగారం ధరతో పాటు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ వంటి అదనపు ఖర్చులు కూడా వర్తిస్తాయి. మొత్తంగా బంగారం, వెండి ధరలు ఒకే రోజులో తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఉపశమనం లభించింది. అయితే రాబోయే రోజుల్లో ధరలు ఏ దిశగా కదులుతాయన్నది అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

# స్పోర్ట్స్

## కామెంటేటర్‌గా రహానే.. భారత్, శ్రీలంక సిరీస్‌తో అరంగేట్రం..!




అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్యా రహానే కొత్త అవకాశాలతో బిజీ అవుతున్నాడు. ఇప్పటికే యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ లో ఆడేందుకు సిద్ధమైన రహానే.. త్వరలోనే కామెంటేటర్‌గానూ అవతారం ఎత్తనున్నాడు. ఇన్నాళ్లు మైదానంలో తన మార్క్ ఆటతో అలరించిన అతడు.. ఇకపై మాటల హోరుతో అభిమానులతో టచ్‌లో ఉండనున్నాడు. భారత్, శ్రీలంక టెస్టు సిరీస్‌తోనే ఈ మాజీ కెప్టెన్ కొత్త ఇన్నింగ్స్ మొదలవ్వనుంది.రిటైర్మెంట్ అనంతరం శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాడు అజింక్యా రహానే. భారత జట్టును వీడినప్పటికీ క్రికెట్‌తోనే కొనసాగాలని భావించిన అతడు.. కామెంటేటర్‌గా రాణించాలని ఆశిస్న్?న్నాడు. అది కూడా భారత్, శ్రీలంక టెస్టు సిరీస్‌తోనే కామెంటరీ బాక్స్‌లో రహానే సందడి చేయనున్నాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ కామెంటరీ ప్యానెల్‌లో చోటు దక్కించుకున్న మాజీ కెప్టెన్.. టీమిండియా ఆరొందల టెస్టు మ్యాచ్‌లో వ్యాఖ్యాతగా అరంగేట్రం చేయనున్నాడు.'రహానే మ్యాజిక్ ఆగిపోలేదు. కొత్త ఇంటిని వెతుక్కుంది. ఎక్స్‌ట్రా ఇన్నింగ్స్‌లోకి స్వాగతం జింక్స్' అని రహానేకు తమ కామెంటరీ బోర్డులోకి ఆహ్వానించింది సోనీ స్పోర్ట్స్. తన సుదీర్ఘ కెరీర్‌లో రహానే టీమిండియా తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడాడు.భారత జట్టుకు సారథిగా, వైస్ కెప్టెన్‌గా.. మిడిలార్డర్ బ్యాటర్‌గా విశేష సేవలందించిన అతడికి బీసీసీఐ 'ఫిక్స్‌డ్ పింఛన్' ఇవ్వనున్న విషయం తెలిసిందే. ఇకనుంచి నెలనెలా రూ.70 వేలు పింఛను రూపంలో రహానే అందుకోనున్నాడని బీసీసీఐ ధ్రువీకరించింది.

## సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్ అతడే: అశ్విన్

**సీఎస్‌కే కోచ్‌గా ఇయాన్ మోర్గాన్**

**అంచనా వేసిన రవిచంద్రన్ అశ్విన్**

**ధోనీ మళ్లీ కెప్టెన్ అవ్వాలని సూచన**





ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ప్రస్తుతం కొత్త హెడ్ కోచ్ వేటలో ఉంది. సుదీర్ఘకాలం పాటు సీఎస్‌కేకు సేవలు అందించిన హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ బాధ్యతల నుంచి వైదొలగడంతో అతడి స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనే దానిపై తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో 2019లో తన సారథ్యంలో ఇంగ్లాండ్‌కు వన్డే ప్రపంచకప్ అందించిన మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ పేరు రేసులో ముందంజలో ఉన్నట్లు సమాచారం.ఈ అంశంపై భారత మాజీ స్పిన్నర్, సీఎస్‌కే మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో కీలక వ్యాఖ్యలు చేశాడు. సీఎస్‌కే కొత్త కోచ్‌గా ఇయాన్ మోర్గాన్ వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అశ్విన్ చెప్పాడు. ఇప్పటికే దీనిపై ఫ్రాంచైజీ చర్చలు జరిపినట్లు తెలుస్తోందని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెక్‌కల్లమ్ పేరు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, సీఎస్‌కే మేనేజ్‌మెంట్ మాత్రం మోర్గాన్ వైపే ఎక్కువగా మొగ్గు చూపుతోందని యాష్ అభిప్రాయపడ్డాడు. కోచ్ మార్పుతో పాటు సీఎస్‌కే జట్టు నాయకత్వంపై కూడా అశ్విన్ సూచనలు చేశాడు. గత రెండు సీజన్లలో పేలవ ప్రదర్శన చేసిన సీఎస్‌కే ప్రస్తుతం కష్టకాలంలో ఉందని, ఇలాంటి సమయంలో ఎంఎస్ ధోనీ కనీసం ఒక్క ఏడాదైనా మళ్లీ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. పరిస్థితులు నిలకడగా మారే వరకు ధోనీ ముందుండి నడిపిస్తే కొత్త కోచ్‌కు కూడా సెట్ అవ్వడానికి సమయం దొరుకుతుందని, టీమ్ అంతా కలిసికట్టుగా ఉంటుందని అశ్విన్ పేర్కొన్నాడు.కాగా, గత ఐపీఎల్ సీజన్‌లో ధోనీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. దానికి తోడు వరుసగా రెండు సీజన్లలో చెన్నై సూపర్ కింగ్స్.. దారుణ ప్రదర్శన చేయడం అభిమానులను కలవరపెడుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌పై మేనేజ్‌మెంట్ సమీక్ష నిర్వహించి.. కోచ్, ఆటగాళ్ల ట్రేడ్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇందుకోసం మరికొంత సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

## ఆసీస్ గడ్డపై చరిత్ర సృష్టించిన తంజిద్ హసన్..

**తంజిద్ చారిత్రక టెస్ట్ సెంచరీ**

**ఆసీస్‌కు బంగ్లాదేశ్ బిగ్ షాక్**

**డార్విన్ టెస్టులో బంగ్లా ఆధిక్యం**



ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ అదరగొడుతోంది. తొలుత బౌలింగ్‌లో సత్తాచాటిన ఆ జట్టు.. ఇప్పుడు బ్యాటింగ్‌లోనూ సవాస్ విసురుతోంది. ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లాండ్ లాంటి మేటి జట్లు ఇబ్బంది పడ్డా.. బంగ్లాదేశ్ మాత్రం సత్తాచాటుతోంది. డార్విన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో తిరుగులేని ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 198 పరుగులకే కుప్పకూల్చింది బంగ్లాదేశ్. అనంతరం తంజిద్ హసన్ తమీమ్ సెంచరీతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బంగ్లాదేశ్ 65.3 ఓవర్లలో 231/3తో నిలిచింది. ఆ జట్టు ప్రస్తుతం 33 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.ఓవర్ నైట్ స్కోరు 96/1తో రెండో రోజు ఆట ప్రారంభించిన బంగ్లాదేశ్.. కాసేపటికే వికెట్ కోల్పోయింది. మోమినుల్ హక్ (49).. జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన నజ్ముల్ హొస్సేన్ శాంటో.. తంజిద్ హసన్ తమీమ్‌కు జత కలిశాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 93 పరుగులు జోడించారు. సెంచరీ చేసిన కాసేపటికే తంజిద్ ఔట్ అయ్యాడు.ఈ క్రమంలోనే తంజిద్ హసన్.. సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో తొలి శతకాన్ని నమోదు చేశాడు. 188 బంతుల్లో అతడు ఈ ఫీట్ సాధించాడు. టెస్టుల్లో అతడికి ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. అంతేకాకుండా ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గానూ తంజిమ్ చరిత్ర సృష్టించాడు. మొత్తంగా బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా టెస్టుల్లో సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా తంజిద్ నిలిచాడు. 2006లో షహ్రియార్ నఫీజ్ తొలి సెంచరీ కొట్టాడు.తంజిద్ హసన్ సెంచరీ , నజ్ముల్ హోస్సేన్ షాంటో హాఫ్ సెంచరీతో ప్రస్తుతం బంగ్లాదేశ్ ఈ టెస్టులో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. తంజిద్ హసన్ (101) ఔట్ అయ్యే సమయానికి బంగ్లాదేశ్ 65.3 ఓవర్లలో 231/3తో నిలిచింది. 33 పరుగులు ఆధిక్యంలో ఉంది. చేతిలో 7 వికెట్లు ఉన్న బంగ్లా.. భారీ స్కోరు చేస్తే ఈ మ్యాచ్‌పై మరింత పట్టు సాధించే అవకాశం ఉంది.

# ఏడేళ్ల తర్వాత డీపీ మార్చిన ప్రభాస్.. ఫౌజీ లుక్‌తో వైరల్!



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ప్రస్తుతం ఆయన 'ఫౌజీ' చిత్ర షూటింగ్‌లో పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఎలాంటి విరామం లేకుండా అటు తరువాత 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో కూడా పాల్గొననున్నారు. అయితే తన సినిమాలతో పాటు కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడంలో, తోటి నటులకు మద్దతుగా నిలవడంలో ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారు. ఈ నేపథ్యంలోనే ఆయన సోషల్ మీడియా ఖాతాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ పిక్చర్ (డీపీ)ను మార్చారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఫౌజీ'కి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తన కొత్త డీపీగా సెట్ చేశారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో మేకర్స్ నుంచి త్వరలోనే మరిన్ని కీలక అప్‌డేట్లు రానున్నాయి. ముఖ్యంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా, పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా,

# లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డిగా వెంకటేష్..

## -అనిల్ రావిపుడి మూవీ నుంచి పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్!




టాలీవుడ్ లో మోస్ట్ అవేటెడ్ కాంబినేషన్లలో ఒకటైన విక్టరీ వెంకటేష్ మరియు సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపుడి కలయికలో వస్తున్న తాజా చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా రిలీజ్ చేయగా, సోషల్ మీడియాలో ప్రస్తుతం ఇది తెగ వైరల్ అవుతోంది.ఈ పోస్టర్ ద్వారా సినిమాలోని హీరో పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను చిత్ర యూనిట్ పరిచయం చేసింది. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి' అనే పవర్ ఫుల్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన కౌంటర్-టెర్రరిజం మరియు హోస్టేజ్ నెగోషియేషన్ విభాగంలో స్పెషలైజేషన్ కలిగిన ఆర్మీ ఆఫీసర్‌గా ఈ పాత్ర అత్యంత కీలకంగా ఉండనుంది. విడుదలైన పోస్టర్‌లో విక్టరీ వెంకటేష్ పూర్తి ఆర్మీ కమేఫ్లాజ్ యూనిఫామ్, బ్లాక్ కంబాట్ బూట్స్, సన్‌గ్లాసెస్ ధరించి చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. ఒక విలాసవంతమైన బ్లాక్ కలర్ మెర్సిడెస్-బెంజ్ జి-క్లాస్ (జి-వ్యాగన్) కారు బంపర్పై కాలు పెట్టి, ఎంతో గంభీరంగా నిలబడి ఉన్న భంగిమ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. వెనుకవైపు యుద్ధ వాతావరణాన్ని తలపించేలా మేఘావృతమైన ఆకాశం, ఎగురుతున్న మిలటరీ హెలికాప్టర్లు, మరియు కింద ఎగురుతున్న దుమ్ము, నిప్పు రవ్వల ఎఫెక్ట్స్ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేస్తున్నాయి. శ్రీమతి అర్చన సమర్పణలో' షైన్ స్క్రీన్స్ మరియు జెడ్ స్టూడియోస్ పతాకాలపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. దేశభక్తి, హై-వోల్టేజ్ యాక్షన్ మరియు పూర్తి కమర్షియల్ హంగులతో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త సినిమా అనుభూతిని పంచడం ఖాయమని ఫస్ట్ లుక్ చూస్తే స్పష్టమవుతోంది.

# విషపూరిత బంధాన్ని తెంచుకున్నా

వ్యక్తిగత విషయాలను ఎక్కువశాతం చాలామంది గోప్యంగానే ఉంచుతారు. బహిర్గతం చేసుకోరు. కానీ అందుకు భిన్నమైన వ్యక్తిత్వం నటి అనుపమ పరమేశ్వరన్‌ది. తన అనుభవాలు ఇతరులకు హెచ్చరికలా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నిర్మొహమాటంగా మనసును ఆవిష్కరించారామె. 'ప్రేమ పేరుతో ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం నా జీవితంలోకి వచ్చాడు. పరిచయమైన మూడు నెలలకే నిశ్చితార్థం, వివాహం అంటూ బలవంతపెట్టడం మొదలుపెట్టాడు. ఆ తొందరపాటులో ప్రేమకంటే నన్ను నియంత్రించాలనే ఆత్రమే ఎక్కువ కనిపించేది.నేను ధరించే దుస్తులు, సోషల్ మీడియాలో నేను పెట్టే పోస్టులు, చివరికి నేను ఎంచుకునే సినిమాల విషయంలో కూడా ఆంక్షలు విధించడం మొదలుపెట్టాడు. అసలు నటనకే నన్ను దూరం చేయాలని చూశాడు. దాంతో స్వేచ్ఛకు దూరమై మానసికంగా నలిగిపోయాను. కేరవాన్‌లో ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఒక్కోసారి అతని ప్రవర్తన భయం కలిగించేది. ఈ ఆందోళన వల్ల బరువు తగ్గిపోయాను. నా కెరీర్‌లోనే అతి పెద్ద విజయమైన 'డ్రాగన్' సినిమా ప్రమోషన్స్‌కి నేను హాజరు కాకపోవడానికి కారణం కూడా అతనే. అందుకే ఆ విషపూరిత బంధాన్ని అతికష్టం మీద తెంచుకున్నా. ప్రస్తుతం ఆ మానసిక గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది అనుపమ. అయితే ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమె వెల్లడించలేదు. అగ్రహీరో విక్రమ్ తనయుడు ధృవ్‌తో ఆమె కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నట్టు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఇంటర్వ్యూలో అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



# టాక్సిక్ కోసం కియారా చాలా కష్టపడింది

## నటుడు యశ్ ప్రశంసలు




సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక

టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.



Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com